వెబ్‌ల్యాండ్ 2.0లో 363 గ్రామాలు పూర్తి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ సిద్ధార్థ్‌జైన్‌కు వివరించారు. రెండో విడత రీ సర్వేపై సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ 2.0 ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 363 గ్రామాలు పూర్తి చేశామని చెప్పారు. మరో 106 ప్రాంతాల్లో సర్వే చేస్తున్నామన్నారు. వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, భూ సర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, డి-సెక్షన్ పర్యవేక్షకులు సూర్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రాస్ ఓటింగ్ గుబులు

- ప్రభుత్వంపై స్థానిక ప్రజాప్రతినిధుల్లో ఆగ్రహం
- తూర్పుకాపు సభ్యులు ఏం చేస్తారోనన్న ఆందోళన
- ఓటర్లను స్వయంగా తరలించేందుకు వైసిపి ఏర్పాట్లు
- చాప కింద నీరులా ప్రచారం సాగిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని అధికార పార్టీ నేతలు భావించారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆనెపు రామకృష్ణతో ఉపసంహరింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పోటీ అనివార్యమైంది. దీంతో వైసిపి తరుపున నర్తు రామారావు, స్వతంత్ర అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణ పోటీలో ఉన్నారు. గెలుపునకు కావాల్సినంత మెజార్టీ ఉన్నా ఒక్క ఓటు కూడా బయటకు పోకూదనే పట్టుదలతో ఉన్నారు. అటు స్వతంత్ర అభ్యర్థి కూడా వైసిపి ఓట్లను సాధ్యమైనంత కొల్లగొట్టేందుకు చాప కింద నీరులా తనవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ గుర్తుపై ఎన్నికైన వారు ఓటర్లుగా ఉన్నారు. వారిలో ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 776 మంది ఓటర్లు ఉన్నారు. వైసిపి తరుపున గెలిచిన వారు 646 మంది ఉండగా టిడిపి నుంచి గెలిచిన 110 మంది ఇతరులు 23 మంది ఉన్నారు. ఆయా పార్టీలకు ఉన్న ఓట్లను పరిశీలిస్తే వైసిపికి గెలుపు నల్లేరు మీద నడకగా ఉంది. వైసిపి నేతల్లో మాత్రం ఆ రకమైన ధీమా కనిపించడం లేదు. క్రాస్ ఓటింగ్ భయం వారిని వెంటాడుతోంది. బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థిని వారు తేలిగ్గా తీసుకోవడం లేదు. రామకృష్ణకు టిడిపి నేపథ్యం ఉండడం, తూర్పు కాపు సామాజిక తరగతి మద్దతు పలుకుతుండంతో ఓట్ల చీలిక ఉంటుందన్న అంచనాల్లో వారు ఉన్నారు. వైసిపి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఇన్‌ఛార్జి బొత్స సత్యనారాయణ నర్తు రామారావు గెలుపును చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలకు కాస్త కటువుగానే చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం ఎన్ని ఓట్లు ఉన్నాయో, వైసిపికి ఎన్ని ఉన్నాయో గణాంకాలతో సహా వివరించారు. వైసిపికి ఉన్న 646 ఓట్లకు అదనంగా ఓట్లు పడాలి తప్ప ఒక్కటీ తక్కువ కాకూడదని పేరుపేరునా ఎమ్మెల్యేలకు చెప్పారు.

అధికార పార్టీ సభ్యుల గుర్రు

వైసిపి నేతల తీరుపై అధికార పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు చాలా గుర్రుగా ఉన్నారు. ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న శ్రీకాకుళం ఆర్‌డిఒ, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస తహశీల్దార్ కార్యాలయం, పాలకొండ సబ్ కార్యాలయాల ప్రాంతాలకు ఒక్కరోజు ముందే ఓటర్లను తరలించి, వారికి బస ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు ఓటర్లను స్వయంగా పోలింగ్ కేంద్రాలకు తరలించాలని నిర్ణయించారు. తమను పార్టీ నమ్మడం లేదనే ఆవేదన పలువురు ఓటర్ల మధ్య అంతర్గత సంభాషణల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.

స్థానిక ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తి

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన ఆనెపు రామకృష్ణ తూర్పు కాపు సామాజిక తరగతి ఓటర్లతో పాటు ప్రధానంగా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులనే నమ్ముకున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందంటూ ఎపి పంచాయతీరాజ్ అసోసియేషన్ తరుపున పలురూపాల్లో ఆందోళనలు చేశారు. సర్పంచ్‌లతో కలిసి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. మరోవైపు అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల్లో అంతర్లీనంగా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం మళ్లించింది. తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందంటూ లోలోపల కుమిలిపోతున్నారు. పార్టీ సమావేశాలు, పంచాయతీ, మండల సర్వసభ్య సమావేశాల్లోనూ తీవ్ర ఆవేదన వెలిబుచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లుగా గెలిచినా గ్రామాల్లో చిన్నచిన్న పనులు సైతం చేయలేకపోతున్నామనే బాధ అధిక సంఖ్యాకుల్లో ఉంది. ఉపాధి హామీ నిధులతో చేస్తున్న పనులకు బిల్లులూ రాకపోవడంతో ఏం పదవులంటూ మండిపడుతున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో ఉన్న ఈ వ్యతిరేకతే పార్టీ నేతలను కలవరానికి గురిచేస్తోంది. మరోవైపు స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ అన్ని పార్టీల ఓటర్లనూ కలుసుకుంటూ చాప కింద నీరులా ప్రచారం సాగిస్తున్నారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - పలాస

గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు ఆపాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ జిల్లా నాయకులు సిహెచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని, సిపిఎస్ రద్దు చేయాలని అడిగితే కేసులు బనాయించి నిర్బంధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని, సకాలంలో ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యోగులతో సహా అందరినీ కలుపుకొని పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్ని నిర్బంధాలు పెట్టి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులకు ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు ఎన్.గణపతి, మున్నా, శాంతారావు, ఎన్.ఢిల్లేశ్వరి, కె.హేమసూధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారిదే పూర్తి బాధ్యత

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోలింగ్ కేంద్రంలో ఏం జరిగినా ప్రిసైడింగ్ అధికారిదే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఎన్నికలకు సంబంధించిన జోనల్ అధికారులు, పిఒలు, ఎపిఒలకు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి చెప్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోలీసులు పోలింగ్ కేంద్రాలకు వెలుపల ఉంటారని, అవసరమైతే వారి సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. వెబ్ కెమెరాలు సరైన స్థానంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం డివిజన్‌కు సంబంధించి శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల, టెక్కలి డివిజన్‌కు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస డివిజన్‌కు సంబంధించి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు. రిసెప్షన్ సెంటర్‌కు పోలింగ్ బాక్స్‌లు తీసుకువెళ్లినపుడు అవసరమనుకుంటే పోలింగ్ సిబ్బంది ప్రిసైడింగ్ అధికారులతో వెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు లేకుండా పోలింగ్ నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనన్నారు. జోనల్ అధికారులు రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం తెలియజేయాలన్నారు. బ్యాలెట్ పేపర్లు మిగిలినవన్నీ లెక్క ప్రకారం తిరిగి అప్పగించాలని ఆదేశించారు. పిఒలు, ఎపిఒలు పొరపాట్లకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ మొదలుకుని బ్యాలెట్ బాక్సులు సీల్ చేసేంత వరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల పోలింగ్ ఈనెల 13న జరుగనుందని, పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. పోలింగ్ రోజున బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పిఒ డైరీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేయడం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి బ్యాలెట్ బాక్సులు సీల్ అయ్యేంత వరకు నిరంతరంగా వీడియో కవరేజ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కొవ్వాడ ఎస్‌డిసి మురళీకృష్ణ, డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, డిపిఒ రవికుమార్, జిల్లాపరిషత్ సిఇఒ వెంకట్రామన్, జోనల్ అధికారులు, పిఒలు, ఎపిఒలు తదితరులు పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఉక్కునగరం

ఉక్కు కార్మిక సంఘాల నేతలతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాతంత్రవాదులను మండలికి పంపిస్తే పేద, మధ్యతరగతి గొంతును, కార్మిక వాణిని వినిపిస్తారని చెప్పారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నిరంతరమూ ప్రజా సేవ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉక్కు కార్మికులను అభ్యర్థించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రమాప్రభ గెలుపంటే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడమేనని పేర్కొన్నారు. ఎఐసిటియు ప్రధాన కార్యదర్శి చిత్రాల సన్యాసిరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో ఉన్న పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లాయర్లు, ఉద్యోగులు, సిబ్బందిని డాక్టర్ రమాప్రభ కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో డివిఆర్‌ఎస్‌ఇయు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, డిఐటియు నాయకులు సురేష్ కుమార్, సిపిఐ నాయకులు టి.కనకరాజు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రాజబాబు, సిఐటియు నాయకులు వై.టి దాస్, ఎం.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, బి.అప్పారావు, నీలకంఠరావు, కె.ఎం శ్రీనివాసరావు, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13న పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఎన్నికల రోజున మద్యం అమ్మకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. రూట్ బందోబస్తు సిబ్బంది, పోలింగ్ సిబ్బందితో పాటుగా పోలింగ్ కేంద్రం వరకు వెళ్లి, పోలింగ్ ముందురోజు రాత్రి అక్కడే బస చేయాలని సూచించారు. పోలింగ్ రోజున ఎవరైనా పోలింగ్‌కు అడ్డంకులు సృష్టించినా, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినా, గొడవలకు పాల్పడినా అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఒరిజినల్ గుర్తింపు పత్రాన్ని చూపించకుంటే అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా సిబ్బంది ఎవరూ పోలింగ్ కేంద్రం లోపలకు వెళ్లరాదన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ రోజున నిర్వర్తించే విధుల గురించి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 59 పోలింగ్ కేంద్రాల్లో జరగనుండగా, 52,256 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు నాలుగు కేంద్రాల్లో నిర్వహించనుండగా 776 మంది ఓటర్లు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, శివరాంరెడ్డి, ఎస్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు, డి.ప్రసాదరావు, ఎఒ ఎం.శివరామరాజు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఉత్తరాంధ్ర పట్టభద్రులు, స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎటువంటి సమస్యలు లేవన్నారు. బ్యాలెట్ పేపర్లు తీసుకున్నామ, వాటిని పరిశీలించి ముగ్గురు ఆర్‌డిఒలకు శుక్రవారం పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ పేపర్లతో పాటు అదనపు బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్ట్‌తో పాటు ఇతర మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశామని, వాటిని శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పోలింగ్ విధానంపై పిఒ, ఎపిఒ, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్‌రూమ్‌లకు పంపేందుకు రవాణా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ విశాఖలో ఉన్నందున ఆ ప్రక్రియపై సిబ్బందికి విశాఖలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల కోసం స్ట్రాంగ్‌రూమ్‌ను నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్ట్రాంగ్‌రూమ్ మొత్తం సిసి కెమెరాల నిఘాలో ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తక్షణమే బ్యాలెట్ బాక్సులను విశాఖపట్నంకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్యాలెట్ బాక్సులు సీల్ చేసినపుడు, ఓపెన్ చేసే సమయాల్లో వీడియో తప్పనిసరిగా తీయించాలని సిఇఒ సూచించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, మెప్మా, గృహనిర్మాణ సంస్థ పీడీలు ఎం.కిరణ్ కుమార్, ఎన్.గణపతిరావు, ఆర్‌టిసి అధికారలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్, జెడ్‌పి ఉద్యోగుల నిరసన

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి జెఎసి అమరావతి కార్యాచరణలో భాగంగా కలెక్టరేట్, జెడ్‌పి ఉద్యోగులు తమ కార్యాలయాల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కలెక్టరేట్ అధ్యక్షులు డి.సోనికిరణ్ మాట్లాడుతూ ఉద్యోగులు సొంత అవసరాల కోసం దాచుకున్న డబ్బులు కూడా అవసరానికి చెల్లించకపోవడంతో పిల్లల పెళ్లిళ్ల వాయిదాలు పడుతున్నాయని అన్నారు. ఆస్పత్రులకు వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులు నయం చేయించుకోలేక, సొంత ఇల్లు మరమ్మతులు చేయించుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. 11వ పిఆర్‌సిలో పొందుపరచిన క్యాడర్ వారి స్కేల్స్‌ని సంబంధిత శాఖాధిపతులకు ఇంకా పంపలేదంటే దీన్ని బట్టి ఉద్యోగులపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అర్థమవుతోందన్నారు. 11వ పిఆర్‌సి అమలు చేసినప్పటికీ నేటికీ చాలా శాఖల్లో ఉద్యోగులకు స్పెషల్ పేలు, అల వెన్సులు తేల్చలేదన్నారు. 1.4.2020 నుంచి, 31.12.2021 మధ్య కాలానికి అరియర్స్ వెంటనే చెల్లించేలని, 2018 నుంచి పెండింగ్ డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త డిఎల ఊసేలేదన్నారు. గత ఏడాది ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎర్నెడ్ లీవులు, సరెండర్ లీవులు, గ్రూప్ ఇన్సురెన్స్ రుణాలు, విత్‌డ్రాలు, లీవ్ సాలరీలు, సప్లిమెంట్ బిల్లులు, టూర్ టిఎ బిల్లులు రెండు ఏళ్లుగా రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు శ్రీకాంత్, బివివిఎన్.రాజు, లింగరాజు, బి.సుధాకర్, మనోహర్, పి.శ్రీనివాసరావు, తహశీల్దార్ సుధాసాగర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ఆశాజనకంగా పన్నుల వసూలు

- శతశాతం వసూలుపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మాట్లాడుతున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

మున్సిపల్ రీజనల్ పరిధిలోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆస్తి పన్ను వసూలు ఆశాజనకంగా ఉందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు తెలిపారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో పన్నుల వసూలుపై అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం కార్పొరేషన్‌ను కలుపుకొని ఉత్తరాంధ్ర పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో రూ.490.60 కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు రూ.328.33 కోట్లను వసూలు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో రూ.25.66 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.14.96 కోట్లు, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో రూ.5.06 కోట్లు లక్ష్యం కాగా, రూ.మూడు కోట్లు, ఆమదాలవలస మున్సిపాల్టీలో రూ.2.80 కోట్లు లక్ష్యం కాగా, రూ.1.77 కోట్లు, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో రూ.2.77 కోట్లకు రూ.1.59 కోట్లు ఇప్పటివరకు వసూలు చేసినట్లు తెలిపారు. రీజనల్ పరిధిలో నెల్లిమర్లలో రూ.1.26 కోట్లకు రూ.1.06 కోట్లు వసూళ్లతో ప్రథమస్థానంలో ఉందన్నారు. నిర్ణీత గడువులో అన్ని మున్సిపాల్టీల్లో పన్నుల వసూలు కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా మున్సిపాల్టీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, షాపుల అద్దె వసూలుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కిడ్నీ వ్యాధులపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జెమ్స్ ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎర్రా రాజేష్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆర్ట్స్ కళాశాల నుంచి డేఅండ్ జంక్షన్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తరిమికొడదాం... తరిమికొడదాం కిడ్నీ భూతాన్ని తరిమికొడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, ఇతర అనారోగ్యాలు కిడ్నీ వ్యాధికి దారితీస్తాయన్నారు. మంచినీటి కాలుష్యం, షుగర్, బిపి, అధికంగా పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల ఈ వ్యాధి బారిన పడుతున్నారని వివరించారు. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే వ్యాధిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ మూత్రపిండ వైఫల్యానికి దారితీస్తుందని చెప్పారు. వయసుతోనే సంబంధం లేకుండా మూత్రపిండాల వ్యాధి బారిన పడడం బాధాకరమన్నారు. జెమ్స్ ఆసుప్రతి ఆధ్వర్యాన ఈనెల 31వ తేదీ వరకు ఉచితంగా షుగర్, బిపి, క్రియాటిన్, సీరమ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూరాలజిస్టులు డాక్టర్ పట్నాన భానుమూర్తి, సిద్ధవరం శ్రీదీప్ మాట్లాడుతూ జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. డీహైడ్రేషన్, ప్రొటీన్ పౌడర్ల వాడకం, జంక్ ఫుడ్స్ వల్ల కిడ్నీలో రాళ్లు చేరుతున్నాయని తెలిపారు. ఈనెల 10న జెమ్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా కిడ్నీ శస్త్రచికిత్స నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 13 కిడ్నీ మార్పిడిలు విజయవంతం జరిగాయన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, గౌరవాధ్యక్షులు జి.ఇందిరాప్రసాద్, ఇంటాక్ కో-కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు, డాక్టర్ ఆంచట అంజని, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ కూన వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన సాంకేతికాభివృద్ధి ఆవశ్యం

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి
- ఆదిత్యలో యాస్పర్ 2కె23 సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

నూతన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్ రెడ్డి, తదితరులు

సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మానవీయత కొరవడితే సత్ఫలితాలు ఉండవని, నేటి సమాజానికి మానవ విలువలతో కూడిన సాంకేతికాభివృద్ధి ఆవశ్యకమని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు ఐతమ్‌లో నిర్వహించే యాస్పైర్ 2కె 23 సదస్సును ఆయన గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వలసల జిల్లాగా శ్రీకాకుళానికి పేరుందని, ప్రధానంగా మత్స్యకారులు, భవన నిర్మాణ కూలీల వలసలను నివారించేందుకు, టెక్కలి ప్రాంత సమస్యలను గుర్తించి సాంకేతిక పరిష్కారాలు చూపేందుకు ఐతమ్ కృషి చేయాలన్నారు. నైపుణ్యత లేనివారు, తక్కువ నైపుణ్యత గలవారు, మంచి నైపుణ్యతగల వారుగా వర్గీకరించి వీరందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి డేటాబేస్, బిగ్ డేటా ఆధారంగా సేవలను అందించాలని సూచించారు. రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులకు, వృద్ధులకు, చిన్నపిల్లలకు సాంకేతికత సహాయంతో సేవలందించాలన్నారు. హెక్స్‌వేర్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఉన్నతాధికారి సౌగట్ సేన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాము చేసిన పని ఎందుకు చేయాలి? ఎవరి కోసం చేయాలి? అందరి కంటే భిన్నంగా ఎలా చేయగలను? అని ప్రశ్నించుకున్న నాడు ప్రతి ప్రయోగంలో సత్ఫలితాలు వస్తాయన్నారు. ట్రైనీ ఐఎఎస్ లక్ష్మీ స్మృతి మాట్లాడుతూ నేడు సాంకేతికత వల్ల సమాజం ఎంతో లబ్ధిపొందుతుందన్నారు. ప్రతి సమస్యకూ సాంకేతిక పరిష్కారం కనుగొనాలని సూచించారు. నామమాత్రం ప్రయోగాల వల్ల ఒరిగేదేమీ ఉండదని ఏ పని చేసినా సమాజానికి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఐతమ్ చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అందించేందుకు 2001లో గ్రామీణ ప్రాంతంలో ప్రారంభించిన ఐతమ్ నేడు ఎన్నో విజయాలు సాధించిందన్నారు. 60కు పైగా డాక్టరేట్లు కలిగిన అధ్యాపక బృందంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని, ఎప్పటికపుడు పదునుపెట్టి విద్యార్థులకు నైపుణ్యతలను అందించడంలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కన్వీనర్ డాక్టర్ యుడి.ప్రసన్న యాస్పైర్ 2కె 23 లక్ష్యాన్ని తెలుపుతూ ఆదిత్యతో పాటు, ఇతర కళాశాలలకు చెందిన 1500కు పైగా విద్యార్థులు ఈ యాస్పైర్లో పాల్గొనడం విశేషమన్నారు. బ్రాంచ్‌ల వారీగా వివిధ నూతన ఆవిష్కరణలు చేపట్టామన్నారు. కో-కన్వీనర్లు డాక్టర్ పి.శ్రీహరి, డాక్టర్ బి.రమేష్‌నాయుడు, కెవిఎల్.భవానీ, జె.సురేష్‌కుమార్, కెబి.మధుసాహు, విష్ణుమూర్తి, ఆజాద్, రామారావు, చంద్రశేఖర్, దినకర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **ABEDA.** (Old Name) W/o Late **SHAIKH BADRUDDIN** resident of Door No. 2-14-2, padda veedhi, illisipuram, Srikakulam District, Andhra Pradesh-Pin Code-532001. change my name **ABEDA** (Old Name) to **ABIDA BEGUM** (New Name) hence forth my name is being Changed as **ABIDA BEGUM** for all purposes.

క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

సిక్కోలు ఖ్యాతిని చాటాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తుదివరకు పోరాడి సిక్కోలు ఖ్యాతి చాటాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లా యలమంచిలి ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 10 నుంచి 12 వరకు 40వ రాష్ట్ర సబ్ జూనియర్, 5వ ఎపి క్యాడెట్ బాలబాలికల తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొని జిల్లా క్రీడాకారుల బృందం గురువారం పయనమయ్యారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, కురిటి తారకరామ, జి.లక్ష్మణరావు, ముద్దాడ శిరీష, ధనలక్ష్మి కోచ్ ఎండ్ మేనేజర్స్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాదరావు, ఎస్.జోగినాయుడు, ఉషు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్ పాల్గొన్నారు.

కలసికట్టుగా సమాజ సేవ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజ సేవ కోసం వాకర్స్ సభ్యులంతా కలిసికట్టుగా నడుద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కర్రోతు సత్యం పిలుపునిచ్చారు. నగరంలోని విశాఖ-బి కాలనీలో ఉన్న షిరిడీ సాయి మందిర యోగా హాల్లో మారుతీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడక, యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఆహార నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ చీఫ్ కో-ఆర్డినేటర్ పి.జి.గుప్తా, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, స్టార్ వాకర్స్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు, డిప్యూటీ గవర్నర్లు విజయకుమార్, నారాయణరావు, సంజీవరావు, రీజనల్ కౌన్సిలర్ కె.వి.రమణమూర్తి, యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ పాల్గొన్నారు. మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షులుగా కొంక్యాన మురళీధర్, కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, కోశాధికారిగా నారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులుగా వి.వివేకానంద, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కామరాజు, సభ్యులు యోగా గురువు ఓంకారస్వామి, ఐ.రమేష్, కె.విశ్వనాథం, ఆర్.నారాయణరావు, శ్రీనివాసరావు, జాలీ వాకర్గా పూణ్ణ వెంకటరావులు ఎన్నికయ్యారు.

మురళిని సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

అన్ని రంగాల్లోనూ మహిళల రాణింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు ధీటుగా రాణిస్తున్నారని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనిక్ విభాగాధికారి డి.పార్వతి, జిల్లా ఆడిట్ అధికారి సిహెచ్.ప్రభావతి, సహాయ ఖజానాధికారి పి.సావిత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మహిళా విభాగం చైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై ఎక్కడో ఒక దగ్గర దాడులు జరుగుతునే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు వచ్చినా దురాగతాలకు అంతులేకుండా పోతుందన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలని వివక్ష లేకుండా తీర్చుదిద్దాలని కోరారు. ప్రతి పురుషుని విజయం వెనుకా ప్రతి కుటుంబంలోనూ అమ్మగా, ఆలిగా, తల్లిగా మహిళ ఉంటుందని, వారిని గౌరవించాల్సిన ప్రాముఖ్యత ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న పాపారావు

స్త్రీలను గౌరవిద్దాం

స్త్రీలను గౌరవిద్దామని ప్రాణదాత ఫౌండేషన్ చైర్మన్ డోకి శ్రవణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల ఇంటికి వెళ్లి సన్మానించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, ప్రసూతి వైద్య నిపుణులు జి.ప్రమీల, సత్తారు స్రవంతి, చింతాడ నాగమల్లేశ్వరి, బగ్గు సంధ్య, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు లలిత తదితరులను సత్కరించారు. వారికి చీర, మిఠాయిలు, మొక్కలను అందజేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డోకి శ్రావణ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ దానేటి హర్ష, పొట్నూరు ప్రతాప్ కస్యపు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న పార్వతి

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

ఆమదాలవలస : మహిళలు అమితంగా గౌరవించబడే దేశం భారతదేశమని, అందుకే అన్ని విధాలా మన దేశం అభివృద్ధి చెందుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్ అన్నారు. ఐ.పద్మావతి, వై.పుష్ప, ఎం.గృహలక్ష్మి జూనియర్ కళాలల లెక్చరర్లు, బి.లక్ష్మి, బి.పుష్పలు రికార్డు అసిస్టెంట్లు సేవలందిస్తున్నట్లు రోటరీక్లబ్ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో గురువారం ఐదుగురికీ దుశ్శాలువ కపి సన్మానించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పాత్రుని పాపారావు మాట్లాడుతూ అనంత విశ్వంలో సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ పిఒ జె.ఎ.రవిబాబు, కార్యదర్శి పి.తేజలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో శిశువు మృతి చెందలేదు

జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త భాస్కరరావు

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి చెందలేదని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త జె.భాస్కరరావు అన్నారు. గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి ఘటనపై దర్యాప్తు చేసినట్లు ఆయన చెప్పారు. పలాసకు చెందిన రాజాం సురేష్ తన భార్య విజయను ప్రసవం కోసం అదే రోజు రాత్రి 11.40 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారని అన్నారు. అప్పటికే నొప్పులు అధికమై కడుపులోంచి బిడ్డ కాళ్లు, బొడ్డు తాడు ముందుకు రావడంతో ఆ విషయాన్ని సెలవులో ఉన్న ప్రసూతి వైద్య నిపుణురాలికి స్థానిక వైద్య సిబ్బంది సమాచారం ఇచ్చారని అన్నారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారని, అప్పటికే బిడ్డ మతి చెందిందని చెప్పారు. బిడ్డ తండ్రి ఆరోపణలో వాస్తవం లేదని ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ఆ సమయంలో మత్తు వైద్యులు, ప్రసూతి వైద్య నిపుణురాలు లేకపోవడం వాస్తవమేనని అంగీకరిస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు సేవలు అందించడం లేదని ఫిర్యాదులొస్తే తక్షణమే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో సేవలు అందించాలని వైద్యులకు ఆదేశించారు. సమావేశంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, పలాస ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ చిన్నంనాయుడు, వైద్యులు ఎన్.కూర్మారావు, మేఘన, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త భాస్కరరావు

పంచాయతీ సమావేశం వాయిదా

టెక్కలి రూరల్ : టెక్కలి మేజరు పంచాయతీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ సర్వసభ్య సమావేశానికి 20 మంది వార్డు సభ్యులకు కేవలం ముగ్గురే హాజరుకావడంతో కోరం లేదని సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశానికి పూర్తిస్థాయిలో పాలకవర్గ ముఖ్యులు, వార్డు సభ్యులు హాజరుకాకపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. వార్డు సభ్యులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉండడంతో సమావేశానికి హాజరు కాలేకపోయారని కార్యాలయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనికి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన కొన్ని సమావేశాల మాదిరిగానే ప్రజా సమస్యలపై చర్చ కంటే వ్యక్తిగత అభిప్రాయాలు, ధూషణలు, అభిప్రాయ భేదాలకు సమావేశం కేంద్ర బింధువు అవుతుందనే పలువురు సభ్యులు సమావేశానికి డుమ్మా కొట్టారనే ఆరోపణ వినిపిస్తోంది. 20 మంది వార్డు సభ్యులకు 17 మంది సమావేశానికి గైర్హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సర్పంచ్‌లు ఎమ్మెల్సీతో, వార్డు సభ్యులు జెడ్‌పిటిసితో విడివిడిగా సమావేశాలు అవుతున్నారని తెలిసింది.

పరిశీలిస్తున్న పిఒ శ్రీలత

ఐసిడిఎస్ కార్యాలయం మంజూరు

బూర్జ : బూర్జ మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం ఏర్పాటు చేశామని పిఒ శ్రీలత గురువారం తెలిపారు. గతంలో బూర్జ, సరుబుజ్జిలి మండలాలు పాలకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉండేవని పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్ 4న జిల్లాల విభజన తరువాత పాలకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు మన్యం పార్వతీపురం జిల్లాకు వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఉన్న బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు ఒక ఐసిడిఎస్ కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కార్యాలయ భవనాలు ఏమైనా ఖాళీగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించానని తెలిపారు. ఈమెతో పాటు ఎంపిడిఒ రవీంద్రబాబు, అంగన్వాడీ కార్యకర్త రాధిక, సిబ్బంది ఉన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న తోటయ్యదొర

అప్పాపురంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

లావేరు : రాష్ట్రాభివృద్ధి మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. మండలంలోని అప్పాపురంలో గురువారం రాత్రి ఇదే ఖర్మం మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా నిత్యవసర ధరలు పెరుగుదల వైసిపి ప్రభుత్వం అరాచకను వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు గంట్యాడ మహేష్, టిడిపి నాయకులు లంక రాంబాబు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైసిపిలో పలువురు చేరిక

లావేరు : మండలంలోని గోవిందపురం పంచాయతీకి చెందిన టిడిపి నాయకుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పల్లి సూర్యనారాయణ అనుచరులు గురువారం వైసిపిలోకి చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటుగా 60 కుటుంబాలు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు డి.రాజనాయుడు, సర్పంచ్ పిల్లా రాము, వైస్ ఎంపిపి లుకాలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గోవిందరావు

టిడిపి కార్యాలయం ప్రారంభం

మెళియాపుట్టి: తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయాన్ని టిడిపి సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలకు అండగా, సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తామని అన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయమని చెప్పారు. ప్రజా సేవా సదన్ పేర సేవా కార్యక్రమాలూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నంబాల వెంకటరావు, సవలాపురం యల్లం నాయుడు, సనపల తిరుపతిరావు, శ్రీ.కరుణ, నెమలిపురి రాజశేఖర్, కూర్మారావు, జి.శ్రీనివాసరావు, ఎంజిఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న అనిల్

టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి డాక్టర్ పి.అనిల్ తెలిపారు. గురువారం 21 ఆర్‌బికెల పరిధిలోని పశువులకు ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. వసుంధరలో 107 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గణపతి, చలపతి, వీరమ్మ పాడి, రైతులు పాల్గొన్నారు.

అరెస్టు వారెంట్ జారీ

శ్రీకాకుళం లీగల్ : యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ శ్రీకాకుళం డివిజన్ మేనేజర్‌పై గురువారం వినియోగదారుల కమిషన్ రఘుపాత్రుని చిరంజీవి అరెస్టు వారెంట్ జారీ చేశారు. వినియోగదారుని కమిషన్‌లో గురువారం కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్‌బెయిల్‌బుల్ అరెస్టు వారెంట్‌ను జారీ చేశారు.

ఉపాధ్యాయునికి గాయాలు

బూర్జ: మండలంలోని మదనాపురం కూడలి వద్ద గురువారం బైక్ బోల్తా పడడంతో ఉపాధ్యాయునికి గాయాలయ్యాయి సీతంపేటకు చెందిన కె.బాలరాజు మర్రిగూడలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. విధులు నిర్వహించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా... ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ టెక్కలి డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్టర్లు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిఎ మురళి ప్రతి బిల్లుకూ ముడుపులు చెల్లించాలని, లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామని బెదిరించారని అన్నారు. అధికారులను కూడా బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ డిఇ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి, తమకు బిల్లులు చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జి.చిరంజీవులు, యు.పాపారావు, బి.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న జడ్జి హరిత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

చట్టాలపై అవగాహన అవసరమని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ వరకు మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియరు న్యాయవాదులు డి.విజయలక్ష్మి, డి.సరళకుమారి, బి.రామకృష్ణారావు, ఎస్.ధర్మరాజు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

బూర్జ : విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ బి.అశోక్‌బాబు అన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు బూర్జ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కె.కె.రాజపురం, పాలవలస జిల్లా పరిషత్ హై స్కూళ్ల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు అలాగే వ్యసనాలకు బానిసలు కాకుండా సరైన మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. మీమీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు నిర్వహిస్తే.. పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన గుళికలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతోర్లాడలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యాన విత్తన గుళికలు తయారీ విధానాన్ని మహిళా రైతుల సమక్షంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలను విత్తన గుళికలుగా మార్చి విత్తుకోవడం వల్ల విత్తనాలు నేలలో పాడవకుండా కొన్ని నెలల వరకు ఉంటాయని తెలిపారు. విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేయడానికి బీజామృతం, బంకమట్టి పొడి, ఘనజీవామృతం పొడి, బూడిదను వాడుతారని వివరించారు. ప్రకృతి సేద్యంలో విత్తన గుళికలు విధానం ప్రత్యేకమైనదని, వర్షాధార పరిస్థితుల్లో పొడి నేలల్లో విత్తనాలను విత్తన గుళికలుగా మార్చి వేసుకున్నట్లయితే వర్షాలు కురిసే సమయం వరకు విత్తనాలు నేలలో పాడవకుండా సురక్షితంగా ఉంటాయని అన్నారు. ఈ విధానాన్ని సీడ్ పెల్లటైజేషన్ అని అంటారని తెలిపారు. ఇలా చేసుకుని వేసుకోవడంతో విత్తనాలకు నీరు అవసరం ఎక్కువగా ఉండదన్నారు. అలాగే రైతులందరూ నీరు అందుబాటులో లేని పొలాల్లో నేలను ఖాళీగా ఉంచకుండా సీట్ బెల్లటైజేషన్ చేసి విత్తనాలను ఎత్తుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

ఇచ్ఛాపురం: ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికల తయారీతో పంట దిగుబడి సాధించవచ్చని, దీంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ అన్నారు. గురువారం మశాఖపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ నిర్వహించారు.. డిపిఎం, ఈవిసి, ఆర్‌డిఒ, డిపిఎం ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక విత్తన గుళికలు తయారు చేయడంతో పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరెడ్డి, నల్ల కామరాజు, ఆశి ఈశ్వరి, రాధ, పిఆర్‌పి తులసయ్య, ఐసిఆర్ పి.నాగమణి, రూప, కుమారి పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆధునిక వైద్యం

శ్రీకాకుళం అర్బన్ : కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యాధునిక వైద్యం అందించే సామర్థ్యం, అనుభవజ్ఞులైన డాక్టర్లు మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని కన్సల్టెంట్ నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ కొర్ల విద్యాసాగర్, డాక్టర్ రాయపురెడ్డి రంగనాథరావు, కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ దుంపల హరిప్రసాదరావు వెల్లడించారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధికి అందిస్తున్న వైద్య సేవలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వరల్డ్ కిడ్నీ డే 2023 థీమ్ అందరికీ కిడ్నీ ఆరోగ్యం-అనుకోని వారి కోసం సిద్ధం చేయడం, మూత్రపిండాల వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, సమర్థవంతమైన నిర్వహణ సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. మహిళలు తమ పని బిజీ పడి కిడ్నీల సంగతే మర్చిపోతున్నారని అన్నారు. కిడ్నీల విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యాప్సికంలో ఉండే విటమిన్ ఎ, సి, పోటాషియం తదితర పోషకాలు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు ఉపయోగపడతాయన్నారు. నిత్యం వెల్లుల్లిని ఏదో ఒక రూపంలో తీసుకుంటే కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక, వైద్య సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారులు

దానేటి శ్రీధర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ ధానేటి శ్రీధర్ జిల్లా వాసులకు అత్యాధునికమైన వైద్య సేవలు అందించేందుకు తపిస్తారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలోని మెడికవల్ ఆస్పత్రిలో గైనికాలజిస్ట్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టిన రోజులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు జెమ్స్, న్యూబ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన 200 మంది రక్తదానం చేశారు. అలాగే నగరంలోని అనాథశ్రమాలకు రెండు పూటలా ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కపారాణి తదితరులు పాల్గొన్నారు.

గజమాల వేస్తున్న అభిమానులు

విశాఖకు 3 స్టాప్ సర్వీసు ప్రారంభం

టెక్కలి: ప్రయాణికుల కోరిక మేరకు టెక్కలి నుండి విశాఖకు 3 స్టాప్ నూతన సర్వీసులను గురువారం నుండి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సర్వీసులు ఉదయం 8, 9గంటల సమయంలో టెక్కలి నుండి బయదేరి కొత్తపేట, నరసన్నపేట, శ్రీకాకుళం మీదుగా విశాఖపట్నం చేరనున్నట్లు తెలిపారు. మరల విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి 11.45 గంటలకు, 12.45.గంటలకు బయలుదేరి టెక్కలికి 3 స్టాప్ సర్వీసుగా వస్తాయని తెలిపారు. కొత్త బస్సులు వచ్చిన వెంటనే విశాఖకు త్వరలో మరో రెండు 3 స్టాప్ నూతన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

హర్షవర్ధన్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

యువతరం సేవా సమితి సభ్యులు నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. గురువారం హరిదాసుపురానికి చెందిన నిరుపేద పూజారి కామేశ్వరరావు కుమారుడు హర్షవర్ధన్(11) రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. వైద్యం కోసం రూ.16వేల చెక్కు, వీల్ చైర్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, కార్యదర్శి గోరకల అశోక్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి బత్తిని రమేష్, ఇన్‌ఛార్జి సభ్యులు గాడి అఖిల్, గున్న వెంకటరమణ, కొడి నిహాల్, గోరకల విఘ్నేష్, గోరకల సునీల్, జ్యోతి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి

రెడ్‌క్రాస్ అంత్యక్రియలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని నక్క వీధి రామ మందిరం వద్ద గురువారం తెల్లవారు జామున 60 ఏళ్ల అనాథ వృద్ధురాలు మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సిబ్బంది అంబులెన్స్‌లో మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సభ్యులు జి.పవన్‌కుమార్, వాలంటీర్లు జి.సూర్యప్రకాష్, జి.సునిల్‌దేవ్, ఆర్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మృతదేహాన్ని తరలిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస సబ్ డివిజన్ పరిధి 33కెవి మందస, 33కెవి సోంపేట విద్యుత్ లైన్‌లో దెబ్బతిన్న స్తంభాలు మార్చేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని టెక్కలి విద్యుత్ శాఖ ఇఇ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కెవి శ్రీనివాస నగర్, 11కెవి నెమలికొండ, ఎంపిడిఒ కార్యాలయం రోడ్డు, శ్రీనివాసనగర్, పాత జాతీయ రహదారి, రోటరీనగర్, నెహ్రూ నగర్, ఎన్ఎన్.పురం, పలాస ప్రభుత్వ కళాశాల రోడ్డు, వాసుదేవుపేట, మొగిలిపాడు, తహశీల్దార్ కార్యా లయం రహదారి, పలాస ఆర్‌డిఒ కార్యాలయం రోడ్డు, శాసనం, గాంధీనగర్-2, రాజమ్మ కాలనీలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కూన మీనాకుమారి అన్నారు. మండలంలోని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రక్త పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులను పంపిణీ చేశారు. అనంతరం 30 మంది గర్భిణులకు, వారితో వచ్చిన సహాయకులకు సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యాన భోజనాన్ని అందించారు. అలాగే పట్టణంలోని మోణింగివారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయి మెట్టక్కివలస వారి ఆధ్వర్యాన 80 మందికి అమృత ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.నమ్రతాప్రియ, బి.వసంత, సత్యసాయి సంస్థల కన్వీనర్ చీడిపోతు సూర్యారావు, ఎం.జనార్ధనరావు, రామానుజులు, గజపతిరావు, మల్లేశ్వరరావు, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : భోజనం వడ్డిస్తున్న సత్యసాయి సభ్యులు

జి.సిగడాం : వైద్యులతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

గర్భిణులకు ఉచిత భోజనం

జి.సిగడాం : ప్రతి నెలా 9న ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే గర్భిణులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందజేస్తామని ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు జి.సిగడాం మండలం బాతువ ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు గురువారం మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బాడ కళ్యాణి, ఆదినారాయణ పాల్గొన్నారు.